క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో స్వచ్ఛభారత్

నాగార్జునసాగర్ : స్థానిక బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవిలత, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ లలిత, సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లి వాసికి డాక్టరేట్

నిడమనూరు : మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన వట్టికోట ప్రవీణ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నంచి డాక్టరేట్ లభించింది. డాక్టర్ సయ్యద్ అజీమ్ ఉన్నిసా పర్యవేక్షణలో ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో ప్రవీణ్ పరిశోధన చేసినందుకు ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన 84 స్నాతకోత్సవంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్, వీసీ కుమార్ మొగళం చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మిర్యాలగూడలో వ్యాపారుల ర్యాలీ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు మార్వాడీ హటావో, తెలంగాణ బచావో అనే నినాదంతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ వ్యాపారులు, కార్మికులు ఉన్నారు.

‘పనుల జాతర’ ప్రారంభం

నిడమనూరు : మండలంలోని పార్వతీపురం గ్రామంలో పనుల జాతర–2025 కార్యక్రమాన్ని మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువుల షెడ్డు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేవారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు కోళ్లు, పశువుల షెడ్లు, పొలం బాటల పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ కరపత్రం ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : హైదరాబాద్‌లో ఈనెల 24న ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 14వ స్మారకోపన్యాసం కార్యక్రమ కరపత్రాన్ని శుక్రవారం స్థానిక విజేత డిగ్రీ కళాశాలలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు హరి, కళాశాల ప్రిన్సిపల్ ధనుంజయ, వైస్ ప్రిన్సిపల్ మధు, చారి, చిదేళ్ల యాదయ్య, దుర్గయ్య, ప్రభాకర్, శ్రీనివాసాచారి, రమేష్, వాసు, వీరయ్య తదితరులున్నారు.

మల్లేశ్వరి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నిడమనూరు : బొకమంతలపహాడ్‌లో ప్రేమికుడు మోసం చేశాడని ఆత్మహత్యకు పాల్పడిన ధర్మారపు మల్లేశ్వరి కుటుంబాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే రూ.లక్ష, జెడ్పీటీసీ కొండేటి మల్లయ్య రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు కొండేటి మల్లయ్య, ఎడవెల్లి వల్లభారెడ్డి, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ గంజి వెంకటేషం, పీఆర్ ఏఈ సాయిప్రసాద్, నాయకులు నందికొండ మట్టారెడ్డి, నర్సింగ్ విజయ్‌కుమార్, అమ్మిరెడ్డి వేణుధర్‌రెడ్డి, ఇప్ప వీరయ్య, చెర్క శ్రీను, రేఖ వెంకన్న, మోసాల శ్రీను, ఆవుల జానయ్య, మైనం రాంచంద్రయ్య, అమ్మిరెడ్డి బ్రహ్మానందారెడ్డి పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రం పరిశీలన

చందంపేట : చందంపేట మండల కేంద్రంలోని పశు వైద్య కార్యాలయాన్ని శుక్రవారం జాయింట్ డైరెక్టర్ రమేష్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని చెప్పారు. ఆయన వెంట వెటర్నరీ డాక్టర్ ధనలక్ష్మి ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

అడవిదేవులపల్లి : బీజేపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేయడం సరైంది కాదని, అక్రమ అరెస్టులు ఉద్యమాలను ఆపలేవని బీజేపీ నేతలు ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంగుల లింగరావు, జిల్లా కమిటీ సభ్యుడు పెద్దింటి కొండల్, కురాకుల రవీంద్రకుమార్, పానుగోతు కోటేష్ తదితరులున్నారు.

ముందస్తు అరెస్ట్ అప్రజాస్వామికం

కొండమల్లేపల్లి : బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పలువురు బీజేపీ నాయకులను కొండమల్లేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో గంట శ్రీను, బొడ్డు యాదయ్య, నర తరుణ్, చందు, హనుమంతు, రాము ఉన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కొండమల్లేపల్లి : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అజ్మీరా రమేష్ సూచించారు. శుక్రవారం కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. తహశీల్దార్ నరేందర్, ఎంపీడీవో బాలరాజురెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో భయం.. భయం!

- ప్రజలపై దాడిచేసి గాయపరుస్తున్న శునకాలు
- భయాందోళనలో మిర్యాలగూడ పట్టణ ప్రజలు
- కుక్కల బెడద నుంచి కాపాడాలని వేడుకోలు


మిర్యాలగూడ పట్టణంలోని రెడ్డీ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని వివిధ కాలనీల ప్రజలు కుక్కల బెడదతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రోడ్లవెంట, వీధుల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని కాలనీల ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో ఒంటరిగా వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ఉదయం, పగలు, సాయంత్రం, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా సంచరిస్తూ, అరస్తూ ఒంటరిగా వెళ్లే వారిపై దాడిచేస్తూ గాయపరుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు ఎక్కడి నుంచి కుక్కలు వచ్చి దాడులు చేస్తాయోనని భయంభయంగా గడుపుతున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావడంలేదని పట్టణ ప్రజలు అంటున్నారు. వీధుల్లో తిరిగే వాహనాల వెంట పడుతుండడంతో వాటిని తప్పించబోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి.

ఈ కాలనీల్లోనే కుక్కల సంచారం ఎక్కువ..

పట్టణంలోని గాంధీనగర్, సాబునగర్, సుందర్‌నగర్, రెడ్డీకాలని, శాంతినగర్, బంగారుగడ్డ, రవీంద్రనగర్ కాలనీ, నందిపాడు, శ్రీనివాసనగర్, వెంకటాద్రిపాలెం తదితర ప్రాంతాలలో వీధి కుక్కలు ఎక్కువగా సంచరిస్తూ జనంపై దాడిచేయడంతోపాటు వాహనాదారుల వెంటపడి కరుస్తున్నాయి. దీంతో నిత్యం ఎక్కడో ఒకచోట కుక్క కాటుకు గురవుతూనే ఉంటున్నారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుక్కలను పట్టుకుని పట్టణంలో తమ కష్టాలను, నష్టాలను తొలగించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

జరిగిన కొన్ని సంఘటనలు..

- గతేడాది గాంధీనగర్‌లో ఒకేసారి పది కుక్కలు ఓ వృద్ధుడిపై దాడి చేస్తుండగా స్థానికులు గుర్తించి అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.
- ఇటీవలషాబునగర్‌లో ఓ వాహనాదారుడిని కుక్కలు వెంబడించగా వాటిబారి నుంచి తప్పించబోయి బైక్‌పైనుంచి కిందపడి గాయాల పాలయ్యాడు.
- రవీంద్రనగర్ కాలనీలో ఓ బాలుడు కిరాణం దుకాణం వద్దకు వెళ్లి వస్తుండగా రెండు కుక్కలు బాలుడిపై దాడిచేసి గాయరిచాయి.

కుక్కలతో ఇబ్బందులు పడుతున్నాం



పట్టణంలో వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలపై దాడిచేస్తూ గాయాల పాలు చేస్తున్నాయి. దీంతో బయటకు వెళ్లాంటే బయమేస్తుంది. ఇళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు ఎక్కడ దాడియచేస్తాయోనని భయంగా ఉంది. వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– బలరామ్, రవీంద్రనగర్ కాలనీ, మిర్యాలగూడ

కుక్కలను నియంత్రిస్తాం



ప్రభుత్వ నిబంధనల మేరకు కుక్కలను నియంత్రిస్తాం. పట్టణంలోని కుక్కలకు కు.ని శస్త్ర చికిత్సలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల పలు కాలనీల్లో వీధి కుక్కలకు కు.ని శస్త్ర చికిత్సలు చేసి వదిలేశారు. ఇంట్లో కుక్కలను పెంచుకునే వారు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయించాలి.

– జి. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

యూరియా అందుబాటులో ఉంచాలని వినతి

మిర్యాలగూడ అర్బన్ : దామరచర్ల మండలం కేంద్రంలో రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సురేందర్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారని, వరినాట్లు వేసి నెల గడుస్తున్నా.. యూరియా వేయకపోవడంతో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు యూరియా అందించడంలో రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఇప్పటికై నా గ్రామ పంచాయతీలను యూనిట్‌గా తీసుకొని వ్యవసాయ ఉత్పత్తులు అందించాలని లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాపా నాయక్, దయానంద్, మట్టారెడ్డి, దుర్గయ్య ఉన్నారు.


దామరచర్ల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

యూరియా కోసం పడిగాపులు

నిడమనూరు : యూరియా కోసం రైతులు పడిగాపులుగాస్తున్నారు. యూరియా వచ్చిందా అంటూ పీఏసీఎస్ యూరియా విక్రయ కేంద్రాలకు ప్రదక్షిణలు చేస్తున్నారు. నిడమనూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయానికి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు వందకు పైగా రైతులు యూరియాకోసం వచ్చి వెళ్లారు. ఈ క్రమంలో కొందరు రైతులు అక్కడే నిరీక్షిస్తూ ఇలా కనిపించారు. ఈ విషయమై ఏఓ మునికృష్ణయ్యను సంప్రదించగా మండలానికి ఏటా 3,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని, ఈ ఏడాది ఇప్పటివరకు 1,100 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వచ్చిపోతూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. యూరియా రాగానే నిబంధనల ప్రకారం అందరికీ అందిస్తామని తెలిపారు.

సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మహిళా సంఘాల వినతి

నిడమనూరు : మండలంలోని బొకమంతలపహాడ్‌లో పనుల జాతర కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డికి పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను వివరించారు. సంఘ సభ్యురాలు ఫోర్జరీ సంతకాలతో స్త్రీ నిధి రుణాల్లో రూ.10 లక్షల వరకు అక్రమాలకు పాల్పడిందని, ఆమె ఇటీవల మృతిచెందిందని దీంతో గ్రామంలోని పది సంఘాల సభ్యులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని ఎమ్మెల్యేకు తెలిపారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రుణమాఫీ కాని, వన్ టైం సెటిల్మెంట్ అయిన చేసి తిరిగి రుణాలు అందించేలా చూస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు వేయించాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ

దేవరకొండ : పెంపుడు కుక్కలకు విధిగా రేబీస్ టీకాలు వేయించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ మున్సిపల్,పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో వీధి కుక్కల నియంత్రణ, సామూహిక రేబీస్ వ్యాధి నిరోధక టీకాలపై స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రేబీస్ వ్యాధి సోకకుండా కుక్కకాటుకు గురైన వ్యక్తులు వెంటనే టీకా తీసుకోవడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని అన్నారు. గ్రామాలు, ఆయా కాలనీల్లో వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కుక్కకాటుకు గురైన వెంటనే సంబంధిత వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం పలు కాలనీల్లో పెంపుడు కుక్కలకు పశు సంవర్ధక శాఖ అధికారులు రేబీస్ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ జీవీ రమేష్, కమిషనర్ సుదర్శన్, ఇన్‌చార్జ్ ఏడీ నాగయ్య, వైద్యురాలు ధనలక్ష్మీ, మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

వీధి, పెంపుడు కుక్కలను గుర్తించాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలోని ప్రతి వార్డుల్లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కల వివరాలను వార్డు ఆఫీసర్లు సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశాల మేరకు మున్సిపల్ సమావేశ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, జవాన్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేశ్ నవరాత్రుల్లో భాగంగా మండపాల పరిసరాల్లో శుభ్రంగా ఉంచాలన్నారు. పరిసరాల్లో ఎక్కడ కూడా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. అదే విధంగా వీధి కుక్కలు, జంతు జనన నియంత్రణ కోసం కుక్కలకు స్టెరిలైజేషన్‌పై ప్రత్యేక దృష్టిని సారించనున్నట్లు తెలిపారు. గణేష్ విగ్రహాలకు అవసరమైన ప్రదేశాల్లో కంకర వంటివి నింపాలన్నారు. విగ్రహాల వద్ద పరిశుభ్రతతో పాటు వీధి దీపాలు వెలిగే విధంగా అన్ని ఏర్పాట్ల చేయాలన్నారు. గణేష్ ఉత్సవాలతో పాటు వీధి కుక్కల కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పర్యావరణ పరిరక్షణ ఇంజనీర్ శ్వేతారెడ్డి, ఆర్‌ఐలు సాంబయ్య, సాజి, శంకర్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు, జవాన్లు తదితరులున్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస్

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి

దేవరకొండ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఇందిరాపార్క్ వద్ద నిర్వహించ తలపెట్టిన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. సత్యాగ్రహ దీక్షకు పార్టీలకు అతీతంగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో భాస్కరాచారి, వరికుప్పల శ్రీను, కలాం, కోటేశ్వరరావు, వీరయ్య, సుధాకర్, యాదయ్య, సుందర్, తదితరులున్నారు.

శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు


శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు దృశ్యం

కొండమల్లేపల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దామెర ఆంజనేయులు, పగిడిమర్రి వెంకటేశం, మేకల శ్రీనివాసులు, మేకల చంద్రమౌళి, చక్రధర్, తిరుమలేష్, రంగారెడ్డి, పరమేష్, అశోక్, నరసింహారావు, వెంకటేశ్వర్లు, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభకు చిరునామాగా గురుకులాలు నిలవాలి


క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న పత్యానాయక్

మిర్యాలగూడ అర్బన్ : ప్రతిభకు చిరునామాగా గురుకులాలు నిలవాలని జిల్లా సహకార అధికారి మండల ప్రత్యేక అధికారి పత్యానాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలికల గురుకుల కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన పదిమంది బాలికలకు మెడల్స్, ప్రశంసపత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సామాజిక పౌరులుగా ఎదిగే బాలికలకు క్రమశిక్షణ నైతికత విలువలు, పెద్దలను గౌరవించే తత్వాలను పెంపొందించాలని కోరారు. ఆరోగ్య పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. అనంతరం భవిత కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీ నాయక్, ప్రిన్సిపల్ సుజాత తదితరులున్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

దేవరకొండ : విధి నిర్వహణలో ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్టీసీ డిపోలో నిర్వహించిన ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవానికి డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబుతో కలిసి అయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించి ఆదర్శంగా నిలిచిన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆర్టీసీ సిబ్బంది పోలీస్‌శాఖకు సహకరించాలని కోరారు. ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ డ్రైవర్లది కీలక పాత్ర అన్నారు. అనంతరరం ఆయన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్ర మంలో ఏడీఎం పడాల సైదులు, కృష్ణయ్య, పాపరాజు, సమద్, ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులున్నారు.


అవార్డులు అందుకున్న వారితో సీఐ, డీఎం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


పెద్దవూర : పెద్దగూడెంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే


నిడమనూరు : అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

- ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి

పెద్దవూర : రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా హామీలన్నింటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దగూడెంలో రూ.20 లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రెండేళ్లలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామానికి చెందిన 8మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.93660ల నిధులతో పశువుల కొట్టాల నిర్మాణానికి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఉపాధి హామీలో వంద రోజులు పనిదినాలు చేసిన కూలీలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, పబ్బు యాదగిరి, ఎంపీడీఓ ఉమాదేవి, పీఆర్ డీఈ నర్సింహారెడ్డి, నాయకులు ఉడ్తూరి శ్యాంసుందర్‌రెడ్డి, చామల సువర్ణ, దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, బాలయ్య, కిలారి మురళీ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నెల్లికల్లు గ్రామపంచాయితీలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ముత్యాలమ్మ ఆలయంలో పూజలు మండలంలోని ఎర్రచెరువుతండాలో శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎంపీపీ అంగోతు భగవాన్ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణా నాయక్, నాయకులు సాగర్‌రెడ్డి, భీలు నాయక్, లాలు నాయక్, ముని నాయక్, తహసీల్దార్ అనీల్, పంచాయతీరాజ్ ఏఈ సైదులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బిక్షంరాజు, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి

నిడమనూరు : కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిడమానూరు మండలంలోని బొకమంతలపహాడ్ గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టబోయే గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, రూ.12 లక్షల వ్యయంతో అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం గొర్రెల, పశువుల షెడ్ల నిర్మాణానికి మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల జాతర కార్యక్రమంలో భాగంగా పశువుల కొట్టాలు, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్లు, వ్యవసాయ బావులు, పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్న కాంగ్రెస్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు.

గుర్రంపోడు : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ గాలి రవికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారావు, బొమ్ము శ్రీనివాస్‌యాదవ్, శంకర్‌గౌడ్, తిరుగుడు లింగారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు స్థానిక సంస్థల్లో అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఐతగోని జనార్దన్‌గౌడ్, రాష్ట్ర విద్యార్థి సంఘం మాదగోని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన సత్యాగ్రహ పోస్టర్‌ను శుక్రవారం మిర్యాలగూడ పట్టణ కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లిఖార్జున్ యాదవ్, రాము, లక్ష్మణ్‌చారి, సకినాల వేణుమాధవ్, లొడంగి మహేష్, కొమ్మన బోయిన రాజ్‌కుమార్, పగిడి మహేందర్, పరమేష్, స్వామి, పంకజ్, రమేష్, పృధ్విరాజ్, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనార్దన్‌గౌడ్, మహేష్ గౌడ్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

నాగార్జునసాగర్: మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. 21న నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. నందకిషోర్ కిలోమీటరు పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించగా.. జావలిన్ త్రోలో దినేష్ స్వర్ణం, లాంగ్‌జంప్‌లో రజత పతకం సాధించాడు. 60 మీటర్ల పరుగు పందెంలో గణేష్ స్వర్ణపతకం, అలాగే లాంగ్ జంప్‌లోనూ స్వర్ణపతకం సాధించాడు. 600మీటర్ల పరుగు పందెంలో అరవింద్ రజత పతకం పొందగా లాంగ్ జంప్‌లో హరి రజత, రవితేజ 100మీటర్ల పరుగు పందెంలో కాంస్యం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ విద్యార్థులు ఈ నెల 30, 31 తేదీలలో మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో పోటీలలో పాల్గొంటారు.

పెద్దవూర: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఒకే పాఠశాలకు చెందిన 13మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ తరి రాములు తెలిపారు. గురువారం నల్లగొండలోని మేకల అభినవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్–16 విభాగంలో ఈ.సంజు, టీ.సంతోష్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాలను, అండర్–14 విభాగంలో 600 మీటర్ల పరుగు పందెంలో సీహెచ్ శివతేజ, టి.సందీప్, ఎన్.నందులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను, జావలిన్‌లో సీహెచ్ శివతేజ, ఈ.కళ్యాణ్, హైజంప్‌లో పి.జమున, సౌమ్యలు ప్రథమ, ద్వితీయ, లాంగ్‌జంప్‌లో ఎం.సునీత, నందినిలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. షాట్ పుట్‌లో ఎస్‌కే హఫీజ తృతీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు శివరాంను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, రూపా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పెద్దవూర : ప్రశంస పత్రాలతో విద్యార్థులు

దేవరకొండ మున్సిపాలిటీకి మహర్దశ

- యూజీడీ, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరు
- ఇప్పటికే ప్రారంభమైన పనులు
- తప్పనున్న పట్టణవాసుల ఇబ్బందులు

దేవరకొండ : పట్టణంలోని అంతర్గత సీసీ రోడ్లకు మహర్దశ లభించింది. ఏళ్ల తరబడి ప్రధాన రహదారులతో పాటు అంతర్గత సీసీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు అధ్వానంగా మారడంతో పాదచారులు, వాహనదారులు సైతం అవస్థలు పడ్డారు. కాగా ఇటీవల అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పట్టణంలోని ఆయా కాలనీల్లో అధికారులు చేపట్టారు. 2కిలో మీటర్ల యూజీడీ నిర్మాణ పనులతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ చొరవతో ప్రభుత్వం రూ.30కోట్లు మంజూరైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. అందులో భాగంగా పట్టణంలోని ఆయా కాలనీల్లో మొత్తంగా 15కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా ఇప్పటికే యూజీడీ పనులు ప్రారంభం అయ్యాయి.


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యే (ఫైల్)

ఏళ్ల తరబడి

మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో ప్రజలకు గతంలో ఇంటింటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించేందుకు గాను అప్పటి ప్రభుత్వం 2018లో దాదాపు 120కిలో మీటర్ల మేర పైప్‌లైన్ కోసం సీసీ రోడ్లు తవ్వి పనులు చేపట్టారు. కాగా వీటిలో దాదాపు 50కిలో మీటర్ల మేర సీసీ రహదారులు ధ్వంసం అయినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే రెండేళ్ల క్రితం పట్టణంలోని పలు కాలనీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం మరో మారు సీసీ రోడ్లను తవ్వి పనులు పూర్తి చేశారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం మంజూరైన నిధులతో పట్టణంలో చాలా కాలంగా పెండింగ్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే ప్రాధాన్యత క్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు.

కొనసాగుతున్న నిర్మాణ పనులు



దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ధ్వంసమైన సీసీ రోడ్లకు సంబంధించి నిర్మాణ పనులు చేపట్టాం. ఇటీవల రూ.30కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ప్రధానంగా ఎక్కడ సమస్య జఠిలంగా ఉందనేది గుర్తించి అక్కడ ముందుగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నాం. కొంతమేర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు సైతం చేపడుతాం. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశాం.

– రాజు, మున్సిపల్ ఏఈ, దేవరకొండ